ఈవారం రెండు కథలు

వితాతే జిలిన్స్కయితే

ఈ రచయిత్రి వ్యంగ్య హాస్యానికి పెట్టింది పేరు. చిట్టి పొట్టి కథల్లోనే పదునైన వ్యంగ్యాన్ని దట్టించడం ఆమె శైలి. ఎన్ని కథలు రాసిందో ఆమెకే లెక్క తెలీదు. కనీసం పది సంకలనాలు వెలువడ్డాయని మాత్రం మనకు తెలుసు. 'స్వాతిశయం' అంటే ఆవిడకి ఒళ్ళుమంట. మనుషుల్లో దాన్ని తగ్గించడానికి ఆవిడ తన కలాన్ని నిజంగానే కత్తిలా ఉపయోగించింది. పిల్లలకోసం ఆమె రాసిన నాటకాల్లో కొన్ని టి.వి. సినిమాలుగా ప్రసారమయ్యాయి. కవిత్వం కూడా రాసింది. వితాతే జన్మస్థలం లిథువేనియా. ఇది ఒకప్పుడు సోవియెట్ యూనియన్‌లో ఒక రాష్ట్రంగా వుండేది కాని యూనియన్ రద్దయ్యాక స్వతంత్ర దేశంగా మారింది. ఆమెకు ఇప్పుడు సుమారు 60 ఏళ్ళుండొచ్చు. అనేక అవార్డులు కూడా పొందింది.



మాయతెర

సీరియల్ మంచి సస్పెన్స్‌లో వున్నప్పుడు హఠాత్తుగా టెలివిజన్ తెరమీద నుంచి దృశ్యం మాయమైంది. ఒకటి రెండు అస్పష్టమైన మాటల తర్వాత శబ్దం కూడా ఆగిపోయింది. అప్పటిదాకా దాన్ని కన్నార్పకుండా చూస్తున్న కరుణానిధికి ఎవరో వున్నట్టుండి తనను ఎడారి ద్వీపానికి విసిరేసినట్టనిపించింది. సీరియల్ చూస్తున్నంతసేపు తిన్న లావు లావు మటన్ సమోసాలు ఇప్పుడు కడుపులో తిప్పుతున్నట్టుగా వున్నాయి. అసలు బతుకే దరిద్రంగా అనిపించింది. చచ్చిపోయిన ఆ గాజుకన్నును అయోమయంగా చూస్తూ కూర్చున్నాడు. ఎవరో ఒకరితో ఏదైనా మాట్లాడితే బాగుండనుకున్నాడు. ఒక మనిషి సాంగత్యం కోసం అతను తన జీవితంలో అంతగా ఎప్పుడూ వెంపర్లాడలేదు. టెలిఫోన్ డైరెక్టరీ చేతిలోకి తీసుకుని చివరి పేజీ తెరిచాడు. దగ్గరి స్నేహితుల టెలిఫోన్ నెంబర్లు ఆ పేజీలో రాసిపెడతాడు. మొదటి నెంబరుకు ఫోను చేశాడు.

"హలో"– అవతలి గొంతులో కాస్త అయోమయం.

"శీనూ నువ్వేనా మాట్లాడేది?" కరుణానిధి అడిగాడు.

"అవును నేనే. ఏమిటి సంగతి?" గొంతులో అయోమయం ఇంకా పెరిగింది.

"నాకో దెబ్బ తగిలింది..." 'మానసికంగా' అనేముందు సిగరెట్ వెలిగించుకోవడానికి ఆగాడు. రసవత్తరమైన జోకులతో సాగబోయే తమ మగ సంభాషణ కోసం మనసు ఉరకలు వేసింది.

"ఎలా? ఎవరు కొట్టారు?" శీను అర్థమనస్కంగా అడిగాడు. "ఒక పని చెయ్యి. 20 నిమిషాల తర్వాత మళ్ళీ ఫోన్ చెయ్యి. అప్పుడు ఏం చేయాలో ఆలోచిద్దాం. ఓకే?" అన్నాడు.

కరుణానిధి వాచివంక చూసుకున్నాడు. సీరియల్ అయిపోవడానికి ఇంక కచ్చితంగా 20 నిమిషాలే వుంది. వీడెంత వెధవ! స్నేహితుడికి ఏమైందో కనీసం కనుక్కోను కూడా కనుక్కోకుండా ఫోన్ పెట్టేద్దామని చూస్తున్నాడు.

"నన్ను గూండాలు కొట్టారు" కరుణానిధి అనాలోచితంగా అనేశాడు.

"ఓ, అదా సంగతి..." శీను మనసులో ఏవో లెక్కలేసి "ఒక్క 19 నిమిషాలు ఓపిక పట్టగలవా?"

"ఇంకా ఎక్కువసేపే పట్టగలను" విసురుగా ఫోన్ పెట్టేశాడు కరుణానిధి. నల్ల స్కెచ్ పెన్ తీసుకుని శీను ఫోన్ నంబరును అడ్డంగా కొట్టేశాడు. దాంతో వాడికీ తనకీ రాంరాం అనుకున్నాడు.

మిగతా నెంబర్లను పరిశీలనగా చూశాడు. ఎంతో మంచివాళ్ళను తాను ఎంపికచేసుకున్న ఈ మిత్రులలో ఇంకెంత ఊక వుందా అని ఒక నిమిషం ఆలోచించాడు. ఇప్పటికైనా వీళ్ళ నిజస్వరూపాలు తెలుసుకునే అవకాశం లభించిందనుకున్నాడు.

ఇంకో నంబరు తిప్పాడు. చదువుకునే రోజుల్నించి ఫ్రెండ్ వాడు. చివరి అన్నం మెతుకులో కూడా వాటా ఇచ్చేంత స్నేహం.

"హలో"

"రవీ, నేనురా..."

"తొరగా చెప్పు" అసహనంగా అరిచాడు.

"రవీ, ఒక సహాయం చేయాలిరా. నేను తగలబడిపోతున్నారా" కరుణానిధి సిగరెట్ పొగవల్ల సహజంగానే దగ్గుతూ అన్నాడు.

"ఓపికపట్టు. ఒక్క పావుగంట..."

కరుణానిధి రిసీవరు పెట్టేశాడు. అన్నేళ్ళ స్నేహాన్ని చరిత్రలోకి నెట్టేస్తూ స్కెచ్ పెన్‌తో వాడి నంబరును కసిగా కొట్టేశాడు.

మూడో నెంబరు తిప్పాడు. వీడు వాళ్ళిద్దరికంటే కూడా దగ్గర. ఒంటిమీద చొక్కా కూడా తీసి ఇచ్చేంత సాన్నిహిత్యం.

"ప్రసాద్" నేరుగా విషయంలోకి వెళ్ళిపోతూ "నాకోసం ఇప్పుడు ఒక చిన్నపని చేయగలవా?" అన్నాడు.

"ఇప్పుడా? ఏమిటంత అర్జెంటు?" ప్రసాద్ అయిష్టంగా అడిగాడు.

"అర్జంటే" నేడో రేపో చావబోయే మనిషి గొంతుతో "ఇప్పటికే సగం చచ్చివున్నాను" కరుణానిధి నీరసంగా అన్నాడు.

"కాని.. ఒక్క పది నిమిషాలు ఆగగలవా?"

"ఎంతసేపు?"

"పది నిమిషాలు."

కరుణానిధి విసురుగా రిసీవర్ కిందపడేసి ఫోన్ దూరంగా నెట్టేశాడు. పడకకుర్చీలోంచి పైకి లేచాడు. ఏం మిగిలింది తనకి? ఫోన్ పుస్తకంలో మూడు నల్లటి అడ్డగీతలు, రెండు సమోసాలు, భరించలేని ఒంటరితనం. చుట్టుపక్కలంతా స్మశాన నిశ్శబ్దం... హఠాత్తుగా నిశ్శబ్దం బద్దలై ఒక మొగగొంతు మొరటుగా వినిపించింది.

"ముసలినక్కా, ప్రతీకారం తీసుకునే సమయం వచ్చేసిందిరా"

టి.వి.కి మళ్ళీ ప్రాణమొచ్చింది. స్నేహాలు, అన్నం మెతుకులు, చొక్కాలు, ఊక అన్నీ మర్చిపోయి కరుణానిధి మళ్ళీ టీవీ చూడ్డంలో మునిగిపోయాడు. సరిగ్గా హీరోకీ, దొంగల ముఠాకీ మధ్య భీకర పోరాటం జరుగుతున్న క్షణంలో కాలింగ్ బెల్ కఠోరంగా మోగింది. ఏ దున్నపోతు వెధవ వచ్చి చచ్చాడో!

కరుణానిధి కోపంగా తలుపు తీశాడు. గుమ్మం దగ్గర ముగ్గురు లావుపాటి పోలీసులు తుపాకులతో నిలబడున్నారు.

"గూండాలు ఏరి?" వారిలో ఒకడు అడిగాడు.

జవాబు చెప్పేలోపలే కొంతమంది అంబులెన్స్ మనుషులు స్ట్రెచర్ పైకి మోసుకొస్తూ కనిపించారు కరుణానిధికి. కింద తలుపు దగ్గర అప్పుడే వచ్చి ఆగిన ఫైరింజను గంటల శబ్దం...

"మీరందరూ... ఒక్క ఐదు నిమిషాలు ఆగగలరా?" కరుణానిధి అభ్యర్థనగా అడిగాడు.

సామరస్యం

పద్మాక్షి, నారాయణల కుటుంబం కన్నులపండుగ్గా, వీనులవిందుగా వుంటుంది. పిల్లల చదువంటే ఆ దంపతులిద్దరికీ భలే శ్రద్ధ. దానికంటే ముఖ్యమైనదేదీ వాళ్ళ జీవితంలో లేదు. బోరుకొట్టే లెక్చరర్లవల్లా, విసుగుపుట్టించే పాఠాలవల్లా పిల్లలకు చదువురాదని వాళ్ళకు ఎప్పుడో అర్థమైపోయింది. ప్రత్యక్ష అనుభవమే ఉత్తమ మార్గమని గ్రహించారు. ఒకరు చదువు చెప్పే పద్ధతికీ, రెండోవారు చెప్పే పద్ధతికీ తేడా రాకూడదని వారికి తెలుసు. అందుకే చెరో దారిన కాకుండా ఒకే నదిలో రెండు పాయలు ప్రవహించినట్టుగా గలగలా చెప్పుకుపోవడం వారి ప్రత్యేకత. ఈ సామరస్యం వాళ్ళు ఒక్క రోజులో సాధించింది కాదు. మొదట్లో రకరకాల వ్యవహారాలు జరిగాయి. కాని ఇప్పుడు మాత్రం... నేను మొదట్లోనే చెప్పినట్టు వాళ్ల కుటుంబం కన్నులపండుగ్గా, వీనులవిందుగా వుంటోంది.

వాళ్ళింట్లో తెల్లవారుజాము నుంచే పాఠాలు మొదలవుతాయి.

"ఇవ్వాళ కూడా బద్ధకించి ఎక్సర్‌సైజులు చేయలేదా?" పద్మాక్షి కొడుకుని మెత్తగా కోప్పడింది. "రోగిష్టి వెధవలా బతుకంతా కాళ్ళీడ్చుకుంటూ తిరగాలని వుందా?" భర్తమీంచి చూపుతిప్పుకుంటూ నిదానంగా అంది.

"అన్ని చపాతీలు తినకూడదు బుజ్జమ్మా" నారాయణ కూతురితో ప్రేమగా అన్నాడు. "వాటిబదులు పుల్కాలు తినరాదూ! తర్వాత పిప్పళ్ళ బస్తాలా అయ్యాక తిండి తగ్గించినా ఉపయోగం వుండదు" నారాయణ కూడా జాగ్రత్తగా భార్య శరీరంవైపు చూడకుండా నెమ్మదిగా అన్నాడు.

"చూడు బాబూ! నీ జేబులో నిన్న మళ్ళీ సిగరెట్ చూశాను. ముసలినక్కలా జీవితాంతం దగ్గుతూ, ఆయాసపడుతూ బతకాలనుందా నీకు? గారపట్టిన పళ్ళేసుకుని, వాటిమధ్యలోనుంచి నువ్వు కాండ్రించి వూస్తుంటే ఏ ఆడది నీతో కాపురం చేస్తుందిరా? అది సిగ్గుతో నీతో బయటికి కూడా రాదు. అలాంటి బతుకు బతకాలనుందా నీకు?" పద్మాక్షి గొంతులో అదే మెత్తదనం.

ఫోన్ మోగడంతో వాళ్ల చదువుకు అంతరాయం కలిగింది.

పద్మాక్షి ఫోన్ పెట్టేసేదాకా ఆగి నారాయణ కూతురితో అన్నాడు "పాపా, ఒక సంగతి ఎప్పుడూ మర్చిపోవద్దు. పొద్దస్తమానం మాట్లాడే ఆడదాన్ని భరించడం ఏ మగాడికైనా చాలా కష్టం. ఆ ఇల్లు నరకమే. మా రోజుల్లో కంటే ఇప్పటి మగవాళ్లు తెలివైనవాళ్ళు. నాన్‌స్టాప్‌గా మాట్లాడే అమ్మాయిలకు వాళ్లు ఆమడదూరం వుంటున్నారు."

"సాయంత్రం ఆలస్యం చెయ్యద్దు" కొడుకు టై సర్దుతూ, తల్లి ప్రేమగా అంది. "చిన్నప్పటినుంచే అర్ధరాత్రి దాకా సినిమాలకీ, షికార్లకీ తిరిగితే త్వరగా ముసలిడొక్కు అయిపోతావు"

"ఒకసారి అద్దంలో చూసుకో" నారాయణ అద్దం తెచ్చి కూతురి చేతికి ఇచ్చాడు. "ఇలాగేనా వుండడం? బయటే కాదు ఇంట్లో వున్నప్పుడు కూడా అందంగా, ఆకర్షించేట్టుగా వుండాలి. ఎవడో ఒకడు మొగుడు దొరగ్గానే నువ్వూ ముసలి కోడిపెట్టలా వికారంగా తయారవుతావా ఏమిటి కొంపదీసి?"

"బాబూ, అల్లరి తగ్గించరా" పద్మాక్షి కొడుకుని మృదువుగా మందలించింది. "నువ్వు మళ్ళీ పక్కింటి పిల్లాడిని కొట్టావని ఆయనొచ్చి గొడవ చేసెళ్ళాడు. నీ అల్లరికి కారణమేమిటో నాకు తెలుసు. నీ ఒంట్లో ప్రవహిస్తున్న మీ నాన్న రక్తం. ఆ వంశమే అంత. నువ్వు ఆ అలవాట్లకు లొంగిపోతే తర్వాత ఎవరం ఏమీ చేయలేంరా బాబూ. మీ నాన్నవైపువాళ్లు చాలామంది కటకటాలు లెక్కపెట్టినట్టే..."

"ఎంత చదివినా పాఠం రాకపోతే నువ్వు మాత్రం ఏం చేస్తావులేమ్మా" నారాయణ కూతురితో అనునయంగా అన్నాడు. "మీ అమ్మ వారసత్వం. ఆవిడ కుటుంబమంతా దద్దమ్మలూ, ఉంతలే".

సాయంత్రమయ్యేసరికి నారాయణ దంపతులకు అలసట వచ్చేసింది. చదువు చెప్పడం అంత తేలికపనేం కాదు. ఎంత ఓపిక, సమయం కావాలి? ఆ రోజుకి చదువాపి ఇద్దరూ బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి తమ వెడల్పాటి డబుల్ కాట్ మంచమెక్కి కూర్చున్నారు. ఇంత శాంతంగా, పరస్పరం జోక్యం చేసుకోకుండా పిల్లలకు చదువు చెప్పడం రాకపూర్వం వాళ్ళిద్దరు కలిసి తీసుకున్న ఫొటో గోడకు వేళ్ళాడుతోంది. దాని వంక కాసేపు కన్నార్పకుండా చూశారు. దాన్ని చూస్తే ఇద్దరికీ ఒళ్ళుమంటే.

"నువ్వు అదృష్టవంతురాలివి" పొద్దున్నించి చదువు చెప్పడం వల్ల నారాయణ గొంతు బొంగురుపోయింది. "నా స్థానంలో ఎవడున్నా ఈ పాటికి హిమాలయాలకు పారిపోయి వుండేవాడు. నేను మాత్రం నా కర్మఫలాన్ని అనుభవిస్తూ ఇక్కడే పడివున్నాను."

"సీతమ్మవారి కున్నంత సహనం నాకుండబట్టి సరిపోయింది. నా స్థానంలో మరే ఆడదున్నా నిన్ను ఏనాడో ఈ నాలుగో అంతస్తుమీదనుంచి కిందికి తోసిపారేసేది. నేను కాబట్టి పళ్ళబిగువున భరిస్తున్నానని తెలియదూ, వెర్రి వెధవ..." అదే బొంగురు గొంతుతో పద్మాక్షి.

"ఇదంతా మన పిల్లలకోసం..." అని ఇద్దరూ గాఢంగా, సామరస్యంగా నిట్టూర్చారు.

ఆంగ్లానువాదం:
కె.ఎం.కుక్–హొరుజి
తెనుగుసేత:
వేమన వసంతలక్ష్మి